# మన చంద్రకి కోపం వచ్చింది

నాకు భాషను ప్రేమించే మంచిమిత్రుడొకడున్నాడు. అతడికి కాస్త కళాపోషణ కూడా ఉంది. పత్రికల్లో వచ్చే మంచి బొమ్మల్ని కత్తిరించి అట్టేపెట్టి నాలాంటి మిత్రులకి చూపిస్తాడు. అతడి అభిరుచిని మెచ్చుకుంటే, 'నా గురించి కాదు, బొమ్మ గురించి చెప్పు' అనే అసలుసిసలు కళాప్రియుడు. ఓసారి అతడివద్ద ఓ బొమ్మ చూసి, 'చిత్రలేఖనం చాలా బాగుంది' అన్నాను అతడికి నచ్చే భాషలో. అతడు వెంటనే కోపంగా, 'చిత్రలేఖనం కాదు, చంద్రలేఖనం అనాలి' అన్నాడు. అదీ అభిమానుల మనసుల్లో చంద్ర బొమ్మలకున్న స్థానం.

ప్రముఖ చిత్రకారుడిగా అభిమానులందరికీ తెలిసినట్లే మాకూ తెలుసు చంద్ర– 1990 దాకా. అప్పుడతడు ఒక చలనచిత్రానికి సహదర్శకుడిగా మా ఇంటికి రావడం జరిగింది. అంతే– కొద్ది క్షణాల్లోనే అతడు మాకు హితుడు, సన్నిహితుడు, ఆప్తుడు, ఆత్మీయుడు ఐపోయాడు. ఒక చిత్రకారుణ్ణి అంత దగ్గిరగా పరిశీలించే అవకాశం అప్పుడే మాకు లభించింది.

సినీరంగంలో ఆత్రేయకు– రాసి ప్రేక్షకుల్నీ రాయక నిర్మాతల్నీ ఏడిపిస్తాడన్న పేరుంది. పత్రికారంగంలో చంద్రలేఖనానికీ అదే పేరుంది. అందుకు కారణం– చంద్ర వెయ్యాలని బొమ్మ వెయ్యలేడు. ఒక స్పందన, భావావేశం, ఉద్రేకం కలిగినప్పుడే అతడు బొమ్మలు వెయ్యగలడు. అందుకోసం అతడు కథకులతో, పత్రికాధిపులతో, సరసులతో పదేపదే చర్చిస్తాడు. వాటిని మదిలో మథిస్తాడు. అప్పటికి కానీ అతడి కుంచెలో కదలిక పుట్టదు. అందుకే– వెయ్యడానికి క్షణం పట్టినా, యుగం పట్టినా– అతడి బొమ్మని చాలామంది కథకులు తమ రచనకు యోగ్యతాపత్రంగా భావిస్తారు.

చంద్రలేఖనంలో కార్టూన్లది ఒక ప్రత్యేక స్థానం. అవి కేవలం వ్యంగ్య చిత్రాలు కావు. కథాలోకంలో అవి మినీకథనుంచి నవలదాకా ఏదైనా కావచ్చు. కావ్య ప్రపంచంలో అవి హైకూలనించి కావ్యాలదాకా ఏమైనా కావచ్చు. అల్పరేఖల్లో అనల్పశాఖల్నిముడ్చుకున్న అద్భుతాలవి. కారణం అతడు స్వతహాగా కవి, రచయిత. అతడి రచనలు కూడా చిత్రరచనల్లాగే మనోమథనంనుంచి పుట్టినవి. అతడి కార్టూన్లకోసం ఎదురు చూసేవారూ, వాటికోసమే పుస్తకాలు కొనేవారూ చాలామందే ఉండేవారు. చంద్ర ఉన్నట్లుండి కార్టూన్లు వెయ్యడం మానెయ్యగానే పుట్టిన కలవరం పరిమాణాన్ని బట్టి ఆ విషయం మాకు అర్థమైంది.

చంద్ర గురించి తెలిసినవారికి అతడు కార్టూన్లు వెయ్యడం ఎందుకు మానేశాడో కూడా అర్థమౌతుంది. అదేమిటంటే– నా కాలేజి రోజుల్లో– సినిమాల్లో పిడిగుద్దులు, రక్తపు మరకలే హింసగా తోచి అప్రయత్నంగా కళ్లు మూసుకునేవాణ్ణి. ఇప్పుడు సినిమాల్లో రక్తపుటేర్లు ప్రవహించినా, కాళ్లూ చేతులూ తలలూ నరుక్కున్నా ఎల్కేజీ పిల్లలు కూడా కళ్లు పెద్దవి చేసుకుని ఉత్సాహంగా చూస్తున్నారు. ఇష్టమై కాదు– అలవాటు పడి.

అలాగే సమాజంలో అవినీతి, దౌర్జన్యం, హింస వగైరాలు- జనాలకి మామూలైపోయి కళ్లెదుట హత్యలు, అత్యాచారాలు జరిగినా స్పందించే అలవాటు పోగొట్టుకున్నారు. ఆ జనాల్నించి వేరుకాలేని చంద్ర కూడా అలాంటివాటికి స్పందించే అలవాటు పోగొట్టుకున్నాడు. అతడి కార్టూన్లు ఆగిపోయాయి.

దగ్గిరవారు ఊరుకోరు కదా- ఎంతగానో ప్రేరేపించారు, ప్రలోభ పెట్టారు. వారిని కాదనలేని చంద్ర తన వంతు ప్రయత్నం చేశాడు. కానీ అప్పుడు ఏ కారణంవల్లనైతేనేం మన రాష్ట్రం ఇరుగుపొరుగుల కళ్లు కుట్టేటంత పచ్చగా ఉంది. రాష్ట్రమూ, రాజధానీ కూడా అంతర్జాతీయ ప్రతిష్ఠ సంతరించుకున్నాయి. అప్పుడు తను వేసిన కార్టూన్లు చాలా గొప్పగా ఉన్నాయని దగ్గిరవారెంత నచ్చజెప్పినా వినలేదు చంద్ర. తనకి సంతృప్తినివ్వలేదని వాటిని చెత్తబుట్టలో వేసేశాడు.

ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నట్లుండి రాష్ట్రాన్ని ఎండబెట్టేలా, రాజధానిలో మంటపుట్టేలా అవినీతి, ఉద్యమాలు మొదలై ఇంతై అంతయ్యాయి. అవినీతితో జనాల్ని నిలువు దోపిడి చేస్తూ, అసందర్భ ప్రలాపాలతో జనాల్ని రెచ్చగొడుతూ- కొందరు ప్రజానేతలుగా, ప్రజలచే ఆరాధించబడేవాళ్లుగా చెలామణీ అయిపోతున్నారు. వారసత్వంతో హీరోలు, లాలసత్వంతో హీరోయిన్లు, అర్థసత్యంతో దర్శకులు పుట్టుకొచ్చి మన సంస్కృతిని మొదలంటా మార్చేస్తున్నారు. తెలుంగు తెలాంగ్లమైపోతోంది. జనాలు అమాయకంగా, అసహాయంగా భరిస్తున్నట్లు కనబడుతున్నా- పరీక్షగా చూస్తే తెలుస్తుంది- వాళ్లు రగులుతున్న అగ్నిపర్వతాలని.

జనాల్లో ఒకడిగా జనం మనిషిగా జనం నాడి తెలిసిన చంద్ర ఇది గ్రహించి ఆవేశంతో ఊగిపోయాడు.

చంద్ర అమాయకుడని దగ్గిరవారంతా అంటారు. అమాయకుడంటే కల్లా కపటం తెలియని వాడు. భయం ఎరుగనివాడు. తన స్పందనని యథాతథంగా జనం ముందుంచగలిగినవాడు.

అసలే చంద్ర. ఆపైన కోపం వచ్చింది. కుంచె ఝళిపించాడు. అదే సమయమని దగ్గిరవారొచ్చి ఇదివరకటి చెత్తబుట్టను అందించారు. అందులోంచీ కార్టూన్లు తీసి చూస్తే- అది నాటి చరిత్ర కాదు- అచ్చం నేటి చరిత్రే!

నానృషిః కురుతే కావ్యం కాబట్టి చంద్రని ఋషి అనొచ్చు. కానీ ఇక్కడ చంద్ర ఋషిగా భావిని కల గనలేదు. మన చరిత్ర- నాడు, నేడు, రేపు- ఎప్పుడూ ఒక్కటే! అది యథాతథంగా బయట పడ్డానికి చంద్ర వంటివారికి కోపం రావాలి. ఆ కోపానికి కారణభూతులైన- స్వార్థపరులు, దుండగీండ్రు, నయవంచకులు వగైరా వగైరా లందరికీ అభివందనాలు!

సమకాలీన జాతి చరిత్రగా ఈ డస్ట్‌బిన్ కార్టూన్లు మీముందున్నాయి. చదివి ఆనందించి ఊరుకుంటారో, కోపం తెచ్చుకుని ఈ చరిత్రని తిరగవ్రాయాలనుకుంటారో- అది మీ ఇష్టం!

-వసుంధర

ఏప్రిల్ 10, 2013